


పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## మన ఫిలిములకు ఇంతేసి ఖర్చులెందుచేత?
## చాలీచాలని పెట్టుబడి, అసమగ్రమైన స్టూడియోలు
## సర్వజ్ఞులమనుకునే డైరెక్టర్లు కారణం
## - వి.ఏ. ఫజల్ భాయి

(ఇండియన్ ఫిలింనుంచి - 1939)

**మనదేశపు ఫిలిం** పరిశ్రమను ఎదుర్కొన్న ముఖ్య సమస్య ఏమనగా తక్కువకాలంలో, ఇప్పటికంటే ఉత్తమమైన చిత్రాలను, ఎక్కువగా తయారుచేయటం ఎలాగా అనేదే. ఉత్తమ తరగతికి చెందిన చిత్రాలను తయారుచేయటానికి మన ప్రొడ్యూసర్లకు అభిలాష లేకపోలేదు. అలాంటి చిత్రాలంటే దేశంలో, ప్రజల్లో ఆదరణ లేకపోనూలేదు. కాని, సర్వాంగ సంపన్నమైన ఏ నాలుగైదు స్టూడియోలకో తప్ప తక్కినవారికి ఈ సంకల్పం కొనసాగనటంలేదు. చిన్న చిన్న స్టూడియోలవారు ఒకటిగా ఏకీభవించి పనిచేసేనట్టయితే చాలా తక్కువ వ్యయంతోను, ఇంతకంటె చాలా నిపుణంగా కూడా చిత్రాలు తయారుచేయవచ్చు.

***అసమగ్రమైన స్టూడియోలు:***

మనదేశంలో సాధారణంగా ఒక స్టూడియోకు 2లక్షలు ఖర్చవుతున్నది. అనగా, మన దేశంలో వుండి స్టూడియోల అన్నింటియొక్క పెట్టుబడి మొత్తం పాశ్చాత్యదేశాల్లో ఒక్క పెద్ద స్టూడియో పెట్టుబడికి సమానంగా వుంటుందన్నమాట. మనదేశపు స్టూడియోల పద్ధతులు గమనిస్తే వీటి అధ్వాన్నపుస్థితి విశదమౌతుంది. సాధారణమైన స్టూడియో ఒక శబ్దగ్రాహక యంత్రం, ఒకే కెమెరాతో 'ప్రారంభమవుతుంది. కొన్ని స్టూడియోలవారు గంతకు తగ్గ బొంత అన్నట్లు ఆ

కాస్తలోపే స్వంత లేబరేటరీ ఏర్పాటు చేసుకుంటారు. అదీ అసమగ్రంగానే వుంటుంది. ఏ శాఖలో పట్టినా ఖర్చు తక్కువ చేయటమనేదే ప్రధానోద్దేశంగా పెట్టుకుంటారు. స్టూడియోకు కావలసినన్ని దీపాలు వుండవు. విదేశాల్లో మధ్యతరగతి స్టూడియోలో వుండే దీపాలకంటే తక్కువగా వుంటాయి. ఈ దేశంలో సినిమా పరిశ్రమ స్థాపింపబడి మొదటిరోజుల్లో క్రొత్తొక వింతగా వుండడం చేత, ఇలాంటి స్టూడియోలతో కూడా అప్పట్లో పనిసాగించారు. అప్పుడు ప్రజలు మాట్లాడే చిత్రాలంటేనే చాలు. అదే శ్రేణికి చెందినవైనా సరే విరగపడి చూచేవారు. ఆ విధంగా డబ్బు సంపాదించి కొందరు ప్రొద్యూసరులు తమ స్టూడియోలను అభివృద్ధి చేసుకున్నారు. అలాంటివారెవరో నలుగురైదుగురు తప్పితే, మన దేశంలో మొత్తం మీద స్టూడియోలన్నీ ఇంకా ఆరంభదశలోనే వున్నవి. అంతేకాదు. కొత్తగా బయలుదేరుతున్న ఫిలిం కంపెనీలు సైతం చాలీచాలని పెట్టుబడితో చిన్న చిన్న స్టూడియోలను నిర్మించటానికి ప్రయత్నించటం శోచనీయం. 1937, 1938, 1939 సంవత్సరాల్లో అనేకమైన స్టూడియోలు, ఫిలిం కంపెనీలు, మూలబడి, మాయమైపోయినవి. చాలని పెట్టుబడితోను, అసమగ్రమైన సాంకేతిక సాధన సంపత్తితోను ప్రారంభించటం వల్లనే ఇలాంటి విపత్తు సంభవించింది.

***ఖర్చెక్కువ కావటానికి కారణం.***

స్టూడియోలో ఏశాఖగాని వుండవలసిన పద్ధతిలో వుండకపోవటంచేత, మొదట తీసిన ఒకటి రెండు చిత్రాలకు నష్టం రావటంతో స్టూడియో ఆర్థికస్థితికి చిక్కేర్పడుతుంది. అంతటితో స్టూడియో మూలబడటమన్నా జరుగుతుంది, లేదా మరీ ఖర్చులు తగ్గించుకుని మరీ చౌక రకం ఫిలింలు తీయవలసిన అవసరమన్నా ఏర్పడుతుంది. ఉతమ శ్రేణికి చెందిన స్టూడియోల వివరాలను మనం పరిశీలించినట్టయితే వాటికి వుండే విశేషమైన సాధన సంపత్తివల్లను, ఎక్కువ చిత్రాలను తయారు చేయటానికి వాటికిగల సౌకర్యాలవల్లనే ఆ స్టూడియోలకు లాభం కలుగుతున్న విషయం మనకు తెలియకపోదు.

ప్రస్తుతం మన స్టూడియోలతో పని ఇంత మందంగా జరుగుతున్నదన్నా, ఖర్చులింత విపరీతంగా పెరిగిపోతున్నవన్నా వాటికంతటికీ కారణం ఈ చిన్న చిన్న స్టూడియోలు, వాటిల్లో చాలీచాలని పరికరాలున్నూ. ఒక్క సెట్టింగు కంటె ఎక్కువగా పనిచేయటానికి తగిన సాధన సంపత్తి లేకపోవటంచేత ఒక్కొక్క సీమగా పనిసాగించుకోవలసి వుంటుంది. నటీనటులుగాని, కెమెరామన్ మొదలైన పనివాళ్ళుగాని ఒక సెట్టింగు వూడదీసి రెండోది నిర్మించేవరకు చేతులు ముడుచుకుని కూర్చుంటారు. దీనివల్ల ద్రవ్యం ఎక్కువగా ఖర్చుగాక తప్పదు.

విదేశపు స్టూడియోల్లో అనేక సీను ఒక్కమాటుగానే తయారుచేయటానికి తగినంత అవకాశాలున్నవి. నాలుగైదు చిత్రాలొకేసారి తయారౌతూ వుంటాయి. అందుచేత ఒక్కొక్క చిత్రం సామాన్యంగా ఆరువారాలకు మించకుండా పూర్తి అవుతుంది. అందుచేతనే సామాన్యమైన విదేశపు స్టూడియోకు యేడాదిలోపుగా 50 చిత్రాలు తయారుచేయటానికి వీలున్నది. మనదేశంలో సంవత్సరానికి ఒకటి రెండు చిత్రాలతో తృప్తిచెందే స్టూడియోలు లేకపోలేదు. పరిస్థితులు ఈ

విధంగా వుండేంతకాలం ఖర్చులు తగ్గించుకోటానికి వీలుండదు. తక్కిన పరిశ్రమల్లోలాగానే ఫిలిం పరిశ్రమలో కూడా ఎక్కువ పెట్టుబడి, మంచికట్టుబాట్లవల్ల ఖర్చులు తక్కువ చేసుకోవచ్చు.

***షూటింగుకు ముందు జరగవలసిన పని.***

ప్రస్తుతం మన దేశంలో చిత్రాలు తయారుచేయటంలో చాలా విచిత్రమైన పద్ధతులవలంబింపబడ్తున్నవి. స్టూడియోలో పని ప్రారంభించే ముందుగా ఎంతో పని పూర్తికావలసివుంటుంది. కాని ఆ విషయమై ఎవ్వరూ శ్రద్ధవహించరు. మొత్తం సంభాషణలు పూర్తిగా వ్రాసుకోకుండా స్టూడియో పనిలోకి దిగేవారనేకమంది వున్నారు. షూటింగ్ మొదలు పెట్టిన తరువాత రిహార్సల్సు మొదలు పెట్టటం కూడా కద్దు. తమ తమ పాత్రలు క్రమంగా ఏ విధమైన పరిణామాన్ని పొందుతావో, కథ చివరకి ఏ విధంగా తేలుతుందో నటీనటులకుగాని, డైరెక్టరుకుగాని తెలియని పరిస్థితులు సర్వసామాన్యంగా కనిపిస్తాయి. ముందుగా కథ, సంభాషణలు, సినేరియో, పాటలు తక్కిన సమస్త సామగ్రిని తయారుగా పెట్టుకున్న తరువాత షూటింగు ఆరంభించవలెనే గాని, అసంపూర్తిగా షూటింగులోకి దిగినట్టయితే స్టూడియో ఎంతటి సమగ్రమైన చైనా ఫిలిం ఖర్చులు విపరీతంగా హెచ్చిపోతాయి. కాబట్టి మన స్టూడియోలను సర్వాంగ సంపన్నంగా చేయటానికంటే ముందుగా, మన పద్ధతులను లోపరహితంగా చేసుకోవటం ముఖ్యం. చిత్రం తయారు చేయటంలో ప్రధానంగా రెండు దిశలున్నవి. స్టూడియోలో ప్రవేశించక పూర్వం రాతలో చిత్రం యొక్క స్వరూపం యావత్తూ పూర్తికావాలి. తరువాత స్టూడియోలో చేరిన తరువాత ఈ అస్థిపంజరానికి సెల్యులాయిడు ద్వారా జీవం ఏర్పడుతుంది. స్టూడియోలో పని ప్రారంభం కాకపూర్వం చేయవలసినపని చాలా ముఖ్యమైనది. కాని, మన దేశంలో దీనికెవ్వరూ ప్రాధాన్యం యివ్వటంలేదు. కథను ఎన్నుకోటం, సినేరియో వ్రాసుకోటం, సంభాషణలు వ్రాయటం, పాటలు వాటిమట్లు కుదుర్చుకోటం, షూటింగ్ స్క్రిప్టు తయారుచేసుకోటం, డైరెక్టరును ఏర్పరుచుకోవటం, నటీనటులను కుదుర్చుకోటం, రిహార్సల్సు, దుస్తులు నిర్ణయించుకోటం ఎప్పుడే సీనులు షూటింగు చేయవలసినది నిర్ణయించుకోటం ఇన్ని పనులు ముందు జరుగవలసివున్నవి. ఈ కర్మకింత యావత్తూ ముందుగా ముగించుకొని షూటింగు ప్రారంభం చేసేట్టయితే చాలా త్వరగానే చిత్రం పూర్తిచేసుకోవచ్చు.

***డైరెక్టరుల పిరికితనం***

చాలామంది డైరెక్టరులు ముందుగా తమ ఊహలను, ప్రణాళికలను బయట పెట్టటానికి యిష్టపడరు. సంభాషణలు, సినేరియోలు, షూటింగు స్క్రిప్టులను ఇతరశాఖలవారికి చూపరు. వారితో వీటిని గురించి సంప్రదించరు. తక్కినవారికి వీటితో సంబంధమేమిటని వారి అభిప్రాయం. వీటిని తమవద్ద రహస్యంగా మూసి పెట్టుకుంటారు. పైగా మరొక భయం ఏమంటే, తమ అభిప్రాయాలు, తమ కథ, సంభాషణలు, పాటలు, ఫైట్లు, సెట్టింగులు వగైరా ఇంతర కంపెనీలవారు దొంగలిస్తారనే ఊహ. ఎవరో కొందరు పండితులు అలాంటివారు వుంటే వుండవచ్చునేమోగాని మొత్తం

మీద ఫిలిం పరిశ్రమలో వుండేవారంతా పరుల తెలివి తేటలమీదనే ఆధారపడే మంద బుద్ధులని తలంపనక్కరలేదు. తక్కిన కళలన్నిటిలోవలెనే, ఫిలిం కళలో కూడా ప్రతి డైరెక్టరున్నూ తన స్వంత అభిప్రాయాలను ప్రకటించి, ప్రదర్శించవలెననే ఉత్సాహంతో ఉంటాడుగాని, పరులను గుడ్డిగా అనుకరించడానికి ఉత్సాహపడడు. షూటింగుకుముందే చిత్రానికి కావలసిన వస్తుసామగ్రి యావత్తు పూర్తిచేసుకునే పక్షంలో రెండో కంపెనీవారు తమ అభిప్రాయాలను దొంగిలించి నకలు చిత్రాన్ని తయారుచేయటానికి పూర్వమెన్నడో తమ చిత్రం పూర్తిచేసుకోవచ్చు. అమూల్యమైన తమ అభిప్రాయాలను ఇతరులు సంగ్రహించుతారేమోననెడి నిరాధారమైన ఈ భయం చొప్పుననే నటీనటులకు ముందుగా క్రమమైన వద్దికలు కూడా లేకుండా చేస్తున్నారు. ఈ విధంగా ముందే అన్నీ సిద్ధం చేసుకోటం వల్ల చివరకు ఫిలిం ఖర్చులు చాలా భాగం తగ్గిపోతాయి. షూటింగుకు ముందు ఒక వారం రోజులు ఆలస్యం జరిగినప్పటికీ, షూటింగులోకి దిగిన తరువాత ఒక్కరోజు ఆలస్యం జరిగినదానికంటే ఎక్కువ నష్టంరాదు. హిందూ దేశంలో చాలా స్టూడియోలలో డైరెక్టరును నిర్ణయించుకోటంతో తమపని అంతా పూర్తి అయిందనుకుంటారు. డైరెక్టరే కథను నిర్ణయించాలి, లేక స్వయంగా సృష్టించాలి. అతడే సినేరియో వ్రాయాలి. సినేరియోనే షూటింగు స్క్రిప్టుగా ఉపయోగించుకుంటాడు. ఇంతేకాదు, కొన్ని చోట్ల డైరెక్టరే కథ, డైరెక్షను, సంభాషణలు, పాటలకు కూడా కర్త ఐనట్లు ప్రకటించుకుంటాడు. ఈ వివిధ శాఖలలోను ఒక్కొక్క శాఖ ఒక్కొక్క ప్రవీణుడి ద్వారా నిర్వహింపబడవలసి వుండగా ఎంత కుశాగ్రబుద్ధి అయినప్పటికీ ఇన్నింటికీ ఒకడే కర్త అయి అన్నింటిని సమర్ధతతో నిర్వహించకలడనుకోటం కేవలం సాహసం అనాలి.

***కొత్తకథలు రావాలి***

కథల విషయంలో కూడా ఇతర కథకులనుండి కథలను తెప్పించి వాటిలో ఎన్నుకోటం మంచిది. అందువల్ల కొత్త ఊహలు, నూతనమైన అభిప్రాయాలు ఏర్పడతాయి. ఒకే విధమైన కథ, ఒకే విధమైన పాత్రలు వచ్చి విసుగు పుట్టించటం అంతమొందుతుంది. ఈ నూతనత్వం లేకపోవటం వల్లనే మన చిత్రాలు ప్రజాదరణ పొందటంలేదు. ప్రతి స్టూడియోలోనూ న్యాయశాఖ ఒకటి వుండాలి. పండితులు, విమర్శకులు దాంతో సంబంధం కలిగివుండాలి. చక్కని కథలు వ్రాయగల గ్రంథకర్తలు, దేశంలో లేకపోలేదు. వారివద్దనుంచి వచ్చే కథలను ఈ వాఙ్మయశాఖవారు పరిశీలించి, వాటినుంచి తమకు నచ్చినవానిని ఎన్నుకోవాలి. వాటినుంచి డైరెక్టరు తమకు కావలసిన కథను నిర్ణయించుకోవచ్చు. అంతేగాని కథను ఎన్నుకోటంగాని, కథను రాయటంగాని డైరెక్టరుకు ఎంతమాత్రం వదలకూడదు.

Post your comments